క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



కుక్కకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న వైద్యులు

బెల్లంపల్లిరూరల్: మండలంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేష్‌కుమార్, ఎంపీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి, నెన్నెల మండల పశువైద్యాధికారులు సుజాత, ఆర్.దిలీప్, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



దొనబండలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో నూతనంగా నిర్మిస్తున్న యాదవ భవన నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేసి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. రూ.5లక్షల ఎమ్మెల్యే నిధులతో యాదవ సంఘ భవన నిర్మాణం చేపడుతుండగా, యాదవ సభ్యులకు ఈ భవనం అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడి సత్యం, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నహీంపాషా, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోటపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కోటపల్లి, బొప్పారం, సర్వాయిపేట, పార్‌పల్లి గ్రామపంచాయతీల భవన నిర్మాణ పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలో గ్రామపంచాయతీలు ఎంతోగానో అభివృద్ధికి నోచుకున్నాయని, రాష్ట్రంలో, దేశంలో తెలంగాణ గ్రామపంచాయతీలు అవార్డులను సొంతం చేసుకుంటున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో పల్లెలన్ని స్వచ్ఛత దిశగా, ఆరోగ్య పల్లెలుగా మారాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి సురేఖా, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, సర్పంచ్‌లు సతీశ్, రాజక్క, వసంతకుమారి, ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు.

నట్టల నివారణపై అవగాహన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నట్టల నివారణ, బోదకాలు వ్యాధుల నిర్మూలనపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్‌యూనిట్ ఆఫీసర్ నాందేవ్‌లు హాజరై మాట్లాడారు. జులై 20న నట్టల నివారణ, ఆగస్టు 10బోదకాలు నివారణపై మాత్రలు అందజేయనున్నట్లు తెలిపా రు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్, మల్లికాంబ, విజయనిర్మల, సునీత తదితరులు ఉన్నారు.

కురిసిన వర్షం



భీమారంలో...

జన్నారం/భీమారం/వేమనపల్లి: అల్పపీడన ప్రభావంతో గురువారం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భీమారం మండలంలోని మంచిర్యాల– చెన్నూరు జాతీయరహదారిపై వరద నీళ్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రహదారి జలమయంగా మారింది. వేమనపల్లి మత్తడి వాగు వద్ద తాత్కాలిక రోడ్డు బురదమయంగా ఉండటంతో అసంపూర్తి వంతెన మీదుగా రాకపోకలు సాగించారు.

వానొస్తే వరద.. రోడ్డంతా బురద





హైటెక్‌సిటీ కాలనీ నుంచి వెళ్లే వంద ఫీట్ల రోడ్డు పూర్తిగా బురదమయంగా...

జిల్లా కేంద్రంలోనే పేరుగాంచిన హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు కనీసం రోడ్ల మరమ్మతు చేపట్టకపోవడంతో కాలనీ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలోని రోడ్ల మరమ్మతు, కొత్త రోడ్లు వేసేందుకు గతంలోనే నిధులను కేటాయించినా, ఇప్పటి వరకు కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించకపోవడంతో, గతుకుల రోడ్లే కాలనీలో దర్శనమిస్తున్నాయి. ఈ కాలనీ నుంచి లక్షలాది రూపాయల పన్ను మున్సిపల్‌కు చెల్లిస్తున్నా, కాలనీలో రోడ్లను మాత్రం వేయడం లేదు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే గుంతలు పడిన రోడ్లకు, చిన్నపాటి మరమ్మతు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– మంచిర్యాలటౌన్



హైటెక్‌సిటీ టెంపుల్ వెనకాల రోడ్డు



హైటెక్‌సిటీ కాలనీ క్రీడా ప్రాంగణానికి వెళ్లే రోడ్డు..



రోడ్డు నంబర్ 27లో బురదమయంగా...

బురద కష్టాలు ఇంకెన్నాళ్లో..!



పోచమ్మరోడ్డు..

దండేపల్లి డీ–28 కాల్వగుండా కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రోడ్డులో కడెం కెనాల్ సమీపంలో మట్టి రోడ్డు ఉండటంతో చిన్నపాటి వానకే రోడ్డంతా బురద అవుతుంది. దండేపల్లి నేతకాని వాడ నుంచి పోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు మొత్తం బురదమయం కావడంతో ప్రతి, గురు, ఆదివారాల్లో ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బురద కష్టాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– దండేపల్లి

రోడ్లపైనే ఇసుక, కంకర

మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపైనే పలువురు ఇసుక కుప్పలు పోసి, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. పలు అభివృద్ధి పనులను చేస్తున్న కాంట్రాక్టర్లు సైతం రోడ్డును పూర్తిగా మూసేసేలా ఇసుక, కంకర పోస్తున్నా, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి పక్కనే ఖాళీ స్థలాలు ఉంటున్నా, రోడ్డుపైనే ఇసుక పోయడంతో ఇబ్బందిగా మారుతోంది.

– మంచిర్యాలటౌన్



హైటెక్‌సిటీ కాలనీ రాముని చెరువు సమీపంలో రోడ్డుపై ఇసుక కుప్పలు

అంతర్గత రోడ్లు బురదమయం



బురదమయమైన వినాయక నగర్ రోడ్డు

జన్నారం: వర్షాకాలంలో అంతర్గత రోడ్లు బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీతో పాటు కామన్‌పల్లి, కవ్వాల్, ఇందన్‌పల్లి తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?

భీమిని: కన్నెపల్లి మండలంలోని సబ్‌స్టేషన్ నుంచి వెంకటాపూర్ వరకు రోడ్డు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పనులు మొదలై రెండు నెలలు గడిచినా, రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు పనులకు నాసిరకం మట్టి వాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇపటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు కంకర పోసి వాహనదారుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కన్నెపల్లి నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే రోడ్డు..

సమ్మె బాటలో పంచాయతీ కార్మికులు

తాండూర్(బెల్లంపల్లి)/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/కోటపల్లి/నెన్నెల/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీల కార్మికులు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పలు మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ఆవరణలో కార్మికులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలో దిగారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం, జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేస్తున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని, క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.19000చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు తీర్చేవరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. పలుచోట్ల ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు.



కోటపల్లిలో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

భూ కబ్జాపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమ భూములను అధికార పార్టీకి చెందిన నాయకుడితో పాటు ఇటుకబట్టీల యజమానులు కబ్జా చేశారని ఆరోపిస్తూ గురువారం హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమకు న్యాయం చేయాలని కోరుతూ దళిత బాధితులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపల్లి దళిత బాధితులు మాట్లాడుతూ.. 1989లో ప్రభుత్వం గుడిపేట శివారులోని 294సర్వే నంబర్‌లో 44మందికి 11ఎకరాల భూమిని తమకు కేటాయించిందని తెలిపారు. 11ఎకరాల నుంచి 7ఎకరాల భూమిని మంచిర్యాలకు చెందిన కొందరు కబ్జా చేశారని ఆరోపించారు.

టీకానపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన



టీకానపల్లిలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023కి మంచిర్యాల జిల్లా నుంచి 12గ్రామాలు ఎంపిక కాగా హాజీపూర్ మండలంలోని టీకానపల్లి గ్రామ పంచాయతీ కూడా ఎంపికయ్యింది. ఈ నెల 15 నుంచి కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో ఆ బృందం పర్యవేక్షించనున్న అన్ని అంశాల్లోని పురోగతిపై జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ గురువారం సమీక్ష జరిపారు. గ్రామాన్ని సందర్శించి ఇంటింటా వెళ్లి స్థానికులతో కలిసి, అన్ని విషయాలపై ఆరా తీశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీలోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, కార్యదర్శి హారిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్య సామగ్రి పంపిణీ



లక్సెట్టిపేట/పాతమంచిర్యాల/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కాసిపేట: జిల్లా కేంద్రంలోని సినిమా వాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను డీఈఓ యాదయ్య చేతుల మీదుగా అందజేశారు. కాసిపేటలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గాజుల సంపత్ జ్ఞాపకార్థం అతడి కుమారుడు గాజుల అరుణ్‌కుమార్ నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. లక్సెట్టిపేటలోని తలమల గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు, హాజీపూర్ మండలంలోని పెద్దంపేట, కొలాంగూడ గిరిజన తాండా, ర్యాలీలోని కొలాంగూడ గిరిజన గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు సుఖీ సహాయ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు అందజేశారు.

నిర్మానుష్యంగా తహసీల్దార్ కార్యాలయం

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది గురువారం అందుబాటులో లేక నిర్మానుష్యంగా మారింది. కొందరు ఉద్యోగులు మాత్రమే విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ ప్రస్తుతం లీవ్‌లో ఉండగా, డెప్యూటీ తహసీల్దార్ నాలుగు రోజులుగా సెలవులో ఉన్నట్లు సమాచారం. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో హాజరై ఫీల్డ్ విజిట్‌కు వెళ్లగా ధరణి కంప్యూటర్ ఆపరేటర్ స్లాట్‌లు లేకపోవడంతో కలెక్టరేట్‌లో విధులు నిర్వహించడానికి వెళ్లినట్లుగా తెలుస్తోంది. అధికారులు, సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం, విధులకు వచ్చిన కొందరు ఉద్యోగులు ఇతర పనులకు వెళ్లిపోవడంతో తహసీల్దార్ కార్యాలయం బోసి పోయి దర్శనమిచ్చింది.

ఎమ్మెల్యే టికెట్ బీసీలకే ఇవ్వాలి

- బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

దండేపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యే టికెట్ బీసీలకే ఇవ్వాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో బీసీ జాగృతి నాయకులతో కలిసి గురువారం మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఏ ఒక్క పార్టీ కూడా బీసీ అభ్యర్థులకు టికెట్ ఇవ్వలేదన్నారు. అన్ని రాజకీయ పార్టీల్లో బీసీల పాత్ర కీలకంగా ఉన్నప్పటికీ, టికెట్లు మాత్రం బీసీలకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కనీసం వచ్చే ఎన్నికల్లో అయినా, అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకు టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు మంచర్ల సదానందం, ఎదునూరి రమేష్, బింగి సుధాకర్, బారే రాజు, గొల్ల మహేష్, తిప్పని సాయికుమార్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



కరపత్రాలతో ఏఐటీయూసీ నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌కే1ఏ గనిపై గురువారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో నాయకులు మాట్లాడారు. యూనియన్ ఎన్నికల్లో ఓటమి భయంతో టీబీజీకేఎస్ సంఘం కోర్టుకు వెళ్లి ఎన్నికలను వాయిదా వేయించారన్నారు. ఎన్నికలు లేనందునా కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని, వెంటనే ఎన్నికలను జరిపించాలన్నారు. ఎన్నికల ఆవశ్యతను వివరిస్తూ గనిపై కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్, గోవిందుల రమేష్, గాజుల రాయమల్లు, గట్టయ్య, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో రక్షణపై అవగాహన



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

రామకృష్ణాపూర్: రక్షణ నియమాలు పాటిస్తూ ప్రమాదాలు లేని సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దాలని స్థానిక సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి అన్నారు. సీహెచ్‌పీలో ఉద్యోగులకు గురువారం రక్షణపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అప్రమత్తతోనే ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఈ చంద్రమౌళి, నాయకులు శంకర్రావు, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలనీలో తాగునీటి తిప్పలు

శ్రీరాంపూర్: ఏరియాలోని నస్పూర్ న్యూ నాగార్జున కాలనీ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరింగ్‌ల దగ్గర నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కంపెనీ అధికారులు సమస్యను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. న్యూ నాగార్జున కాలనీలోని సుమారు 496క్వార్టర్లలో ఇదే సమస్య ఉత్పన్నమైంది. తాగునీటికి కాలనీవాసులు ఇబ్బంది పడడంతో స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్ ట్యాంకర్లు తెప్పించి తాగునీరు అందిస్తున్నారు. ఈ సమస్యపై డీజీఎం (సివిల్) శివరావును వివరణ కోరగా నస్పూర్ మున్సిపల్ శాఖ అధికారుల కాలనీల్లో కరెంటు స్తంభాలు వేయించే క్రమంలో తవ్విన గుంతల వల్ల తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. వీటికి మరమ్మతు చేసినప్పటికీ, ఎక్కడో చోట పైపులైను జామ్ కావడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. పైప్‌లైన్లను పునరుద్ధరిస్తున్నామని శుక్రవారం ఉదయం నాటికి సమస్యను పరిష్కరించి తాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు.

జీఎంకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు మున్సిపాలిటీ ప్రకారం అద్దె చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జీఎం ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏజెంట్ ఆఫీస్ నుంచి ఉద్యోగులతో ర్యాలీగా వచ్చిన నాయకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గేట్ ముందు కాసేపు బైఠాయించారు. అనంతరం జీఎం మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌గోపాల్, సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రామస్వామి, రాజేందర్, ఐలయ్య, సంజీవ్, రాజమల్లు, ఏఐటీయూసీ నాయకులు కుమారస్వామి, తిరుపతి, రాజేశం, వేణుమాదవ్ తదితరులు ఉన్నారు.

సీజన్ వ్యాధులపై అవగాహన

శ్రీరాంపూర్: వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై కంపెనీ వైద్య ఆరోగ్యశాఖ ఏరియా అధికారి లోకనాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆర్కే 6గనిపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసీ శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రామ్ నరసయ్య, టీబీజీకేఎస్ నాయకులు వెంగల కుమార్ స్వామి, అద్దు శ్రీనివాస్, భూమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: ఎస్సీ సబ్‌ప్లాన్‌లో మంజూరైన సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆధికారి టీ.వి ప్రసాద్ సూచించారు. లింగన్నపేటలో గురువారం కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ హైదరాబాద్‌చే ఎస్సీ రైతులకు కందుల విత్తనాలు, పేరటి కోళ్లను అందజేశారు.

గ్రామ దేవతలకు పూజలు

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట పోచమ్మ ఆలయంలో గురువారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి సల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు.

మోడ్రన్ దోభీఘాట్ ఏర్పాటు చేయాలి

నస్పూర్: పట్టణంలో అన్ని వసతులతో కూడిన మోడ్రన్ దోభీఘాట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం సమర్పించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముత్తరావుపల్లిలో ఏవో కవిత ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

జగ్జీవన్ రాం వర్ధంతి

లక్సెట్టిపేట: పట్టణంలోని అంబేద్కర్ యువజన సంఘం, మండలంలోని రంగపేట గ్రామంలోని ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ఆర్థిక సాయం

పాతమంచిర్యాల: మహిళా తరంగిణి సభ్యురాలు గోపగాని సృజన కిడ్నీ వ్యాధితో బాధతుండడంతో మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యులు, సినిమావాడ వాసులు రూ.33వేలు సేకరించి ఆమెకు ఆర్థిక సాయం చేశారు.

అధ్యక్షుడిగా ముజాఫర్ అలీఖాన్

జన్నారం: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కవ్వాల్ గ్రామానికి చెందిన ముజాఫర్ అలీఖాన్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

దుస్తులు, పుస్తకాలు అందజేయాలి

మందమర్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేయాలని టీడీపీ రాష్ట్ర నాయకులు వాసాల సంపత్ డిమాండ్ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్యతో కలిసి గురువారం పలు పాఠశాలలను సందర్శించారు.